
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 26.0

ANDHRAJYOTHY 3



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శనివారం 26 ఏప్రిల్ 2025

ఎట్లబ్బా.. చేసేది..?

ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత

ఎనిమిది సర్కిళ్లలోనూ ఇబ్బందే

- కర్ణాటక మద్యం రవాణాకు అడ్డుకట్ట ఏదీ?
- నవోదయం 2.0లో కొరవడిన సమన్వయం
- సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమేనా?



పుట్టపర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. అన్ని ఎక్సైజ్ సర్కిళ్లలోనూ సిబ్బంది కొరత ఉండటంతో విధులు సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమంతో పాటు కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, మద్యం అమ్మకాలు పెంచే లక్ష్యం ఆశాఖను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

భారీ సరిహద్దు

జిల్లాలో తనకల్లు నుంచి కనగానపల్లి మండలం దాకా 279 కిలోమీటర్లు సరిహద్దు జిల్లాకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నూతన మద్యం పాలసీతో జిల్లాలో 96 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. జిల్లాకు భారీ సరిహద్దు ఉండటం వల్ల కర్ణాటక మద్యం అక్రమంగా వస్తోంది. ఇది సరిహద్దులో ఉన్న మద్యం దుకాణాల్లో అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు ఎక్సైజ్ శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అడ్డుకట్ట వేయలేకపోతోంది. ఇందుకు సిబ్బంది కొరతే పెద్ద కారణమని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. కర్ణాటక మద్యం దెబ్బకు మడకశిర, అమరాపురం, గుడిబండలో ప్రైవేట్ మద్యం దుకాణాలు మూత వేసి రీటెండర్లు పిలించే పరిస్థితి వచ్చింది.

సారారహిత జిల్లాగా తీర్చిదిద్దేదెన్నడు?

సారా రహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో ఎక్సైజ్ శాఖ నవోదయం 2.0 కార్యక్రమాన్ని మార్చిలో ప్రారంభించింది. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ సర్కిళ్ల ఉండగా ఏడు సర్కిళ్ల పరిధిలో 53 గ్రామాలు గుర్తించి ఏ,బీ,సీ కేటగిరీగా విభజించారు. హిందూపురం సర్కిల్ మినహా మిగిలిన ఏడు సర్కిళ్ల పరిధిలో సారా ప్రభావిత గ్రామాలున్నాయి. నవోదయం 2.0 కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖతోపాటు పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సమన్వయంతో సారా నిర్మూలన చేపట్టాలి. సారాపై ప్రజల్లో అవగాహన కల్పించి జిల్లాను సారా రహితంగా మార్చాలన్నదే లక్ష్యం. ఇప్పటికే మొదటి విడతలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి సారా తయారీ, రవాణా, విక్రయించే వారిని గుర్తించి, సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రెండో విడతలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు, మూడో విడతలో గ్రామ సభలు నిర్వహించి వారికి వేరే ఉపాధి చూపిస్తారు. నాలుగో విడతలో సారారహిత గ్రామంగా ప్రకటించాల్సిఉంది. ఐదో విడతలో ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తారు. ఒక వేళ వారిలో మార్పు రాకుంటే బైండోవర్ కేసులు నమోదు చేసి, పీడీ యాక్టు నమోదు చేస్తారు. సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మినా ఎనిదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 5లక్షల జరిమానా విధిస్తారు. కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో గట్టిగా అమలు చేయాల్సి ఉన్నా ఎక్సైజ్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది.

> **వేధిస్తున్న సిబ్బంది కొరత**
>
> జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 223 మంది ఉండాల్సి ఉండగా 139 మంది మాత్రమే ఉన్నారు. కానిస్టేబుళ్లు 66, హెడ్ కానిస్టేబుళ్లు 5, ఒక ఎస్ఐ పోస్టుతోపాటు ఇతర పోస్టులు మొత్తం కలిపి జిల్లాలో 84 ఖాళీలు ఉన్నాయి. సిబ్బంది కొరతతో సుదీర్ఘ సరిహద్దు కల్గిన జిల్లాలో నాటుసారా నిర్మూలన, కర్ణాటక అక్రమ మద్యం రవాణాకు అడ్డు వేయడం కష్టతరంగా మారిందని ఆశాఖ సిబ్బంది చెబుతున్నారు.

నవోదయం 2.0 సమన్వయమేదీ..?

నవోదయం 2.0 పథకం అమలుకు జిల్లాలో కొన్ని శాఖల నుంచి సహకారం లభించలేదని సమాచారం. ఎక్సైజ్ శాఖతోపాటు పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సమన్వయంతో సారా నిర్మూలన చేపట్టి, సారా రహిత జిల్లాగా మార్చాలి. జిల్లాలో నవోదయం 2.0ను ప్రారంభించిన మొదట్లో ఎక్సైజ్‌శాఖతోపాటు రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖ సంయుక్తంగా పని చేశాయి. ఇటీవల జిల్లాలో కొన్ని పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ శాఖల నుంచి పూర్తి సహకారం అందడం లేదని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు కూడా సహకరించనట్లు సమాచారం. సారా ప్రభావిత గ్రామాల్లో తనిఖీలకు వెళ్లిన వారిపై దాడులు చేసే నేర ప్రవృత్తి కల్గిన వారు ఉన్నారు. ఈనేపథ్యంలో పోలీస్‌ల సహకారం లేకపోతే సారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ దూకుడుగా వెళ్లలేదన్న వాదన ఉంది. ప్రధానంగా కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, బుక్కపట్నం, తలుపుల ప్రాంతాల్లో ఏ కేటగిరీ సారా ప్రభావిత ప్రాంతాలుండగా ఈ పరిధిలో పోలీస్, రెవెన్యూ శాఖ నుంచి నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహణపై పెద్దగా సహకారం లేదన్న విమర్శలున్నాయి. ఓవైపు ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత, పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం లేకపోవడంతో నవోదయం 2.0 కార్యక్రమం సజావుగా సాగేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సమన్వయంతో నిర్వహిస్తున్నాం..

జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహిస్తున్నాం. జిల్లాలో సారా ప్రభావిత గ్రామాలు గుర్తించాం. సారాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రభావిత గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నా పర్యవేక్షణతోపాటు సారా నిర్మూలన, కర్ణాటక అక్రమ మద్యం రవాణాకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్నాం.

\- గోవిందునాయక్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్

సరిహద్దులేని పేకాట

- రోజుకో స్థావరంలో ఆట
- కాపలా కాసే వ్యక్తులకు సకల సౌకర్యాలు
- కిందిస్థాయి పోలీసుల సహకారం
- ఉదయం.. సాయంత్రమే ఆట..?



హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పేకాట మూడు ముక్కలు, ఆరు షోలుగా సాగుతోంది. ప్రధానంగా పరిగి, మడకశిర మండలాల సరిహద్దుతో పాటు హిందూపురం నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారు. పోలీసులు పేకాటరాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతు న్నా, కొంతమంది నిర్వాహకులు బరితెగించి మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వ హిస్తున్నారు. పేకాట నిర్వాహకులకు కొంతమంది కిందిస్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



జయమంగళి నది అడ్డాగా..

పరిగి మండల పరిధి, కర్ణాటక ప్రాంతంలో ఉన్న జయమంగళి నది అడ్డాగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. నిర్వాహకులు పరిగి మండలంవారే కావడంతో పాటు వారికి అధికారుల అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారు. కర్ణాటకకు చెందిన మరో ఇద్దరు నిర్వాహకులు మండల సరిహద్దు ప్రాంతంలో పేకాట ఆడిస్తున్నారు. నిత్యం ఈ మండల సరిహద్దులో లక్షల్లో ఆట సాగుతున్నట్లు తెలిసింది.

సరిహద్దులో..

పురం నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ నిర్వాహకులు ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే ఆటలు ఆడిస్తున్నట్లు తెలుస్తుంది. అది కూడా పోలీసులు ఇతర ప్రాంతానికి బందోబస్తుకు వెళ్లినప్పుడు ఒకరిద్దరు సీఐలు లేరని పక్కా సమాచారం ఉన్నప్పుడే ఇక్కడ పేకాట నిర్వహిస్తున్నట్లు తెలి సింది. ఇక్కడికి స్థానికులే కాక కర్ణాటకకు చెందిన కొంతమంది పేకాట కోసం వస్తున్నట్లు సమాచారం. ఒకరోజు రెండు ఆటలు మాత్రమే సాగిస్తున్నారు. అదికూడా ఉదయం 9గంటల్లోపు సాయంత్రం 5-6గంటలకు మాత్రమే ఆట ఆడుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా హిందూపురం పట్టణ పరిధిలోని వాణిజ్య కేంద్రంగా పిలువబడే ఏరియాలో ఉన్న నదీపరివాహక ప్రాంతంలో ఆడుతున్నట్లు తెలిసింది.

కాపలా పెట్టి మరీ ఆట..

నిర్వాహకులు చుట్టూ పది మందిని కాపలాపెట్టి పేకాట నిర్వహిస్తారు. అదికూడా పేకాట స్థావరం నుంచి ప్రధాన రహదారి వరకు కాపలా ఉంటారు. సంబంధిత పోలీస్ స్టేషన్ సమీపంలో సైతం కాపలా ఉంటారు. ఒకవేళ పోలీస్ స్టేషన్ నుంచి వాహనం బయలుదేరితే మార్గమధ్యంలో ఉన్నవారికి సమాచారం ఇస్తారు. అక్కడి నుంచి పేకాట స్థావరంలో ఉన్నవారికి సమాచారం చేరవేస్తారు. దీనివల్ల పోలీసులకు పక్కా సమాచారం ఉండి స్థావరాలకు వెళ్లేలోపు పేకాటరాయుళ్లు పరారవుతున్నారు. కాపలాగా ఉండే వ్యక్తులకు ఒక్కొక్కరికి గంటకు రూ.వెయ్యిచొప్పున అందజేస్తున్నారు. అంతేకాక ప్రతినెలా మొబైల్ రీచార్జ్ కూడా పేకాట నిర్వాహకులే భరిస్తారు. దీంతోపాటు పేకాట జరిగేరోజు వారి ద్విచక్రవాహనలకు పెట్రోల్, టిఫిన్ ఖర్చులుకూడా నిర్వాహకులే భరిస్తారన్నారు. ఇన్ఫార్మర్‌గా ఉన్న వ్యక్తి నమ్మకమైన వ్యక్తి అయితే చాలు సకల సౌకర్యాలు కల్పిస్తారు.

కిందిస్థాయి సిబ్బంది సహకారం

పేకాట నిర్వాహకులకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కొంతమంది కిందిస్థాయి సిబ్బందితో సత్సంబంధాలుంటాయి. దీంతో ఒకవేళ సీఐ, ఎస్ఐ స్థావరాలకు వెళ్లాలని సమాచారం ఇస్తే వెంటనే వారికి సమాచారం చేరవేస్తారు. ఇందుకోసం నిర్వాహకులు వారానికి ఇంత మొత్తం అని కొందరు పోలీసు సిబ్బందికి అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పండగలు, మరికొన్ని ప్రత్యేక సందర్భాల్లో కింది స్థాయి సిబ్బందికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు విమర్శలున్నాయి. పేకాట నిర్వాహకులు కిందిస్థాయి సిబ్బందిని సరిగా చూసుకోలేదంటే వెంటనే పేకాట స్థావరంపై దాడి జరిపిస్తారని సమాచారం.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, వైద్యసిబ్బంది

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైద్యసిబ్బంది మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మాట్లాడు తూ మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ప్రతిఒక్కరూ వ్యాధి నిర్మూలనలో పాలుపంచుకోవాలన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని సూచించారు. దోమల నుంచి వచ్చే వ్యాధుల గురించి వివరించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఎనుమలపల్లి కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, సీహెచ్ఓ నగేష్, ఇన్‌చార్జి ఏఎంఓ లక్ష్మానాయక్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఎంపీహెచ్ఓ బీవీ రమణయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎంలు, ఆరోగ్యకార్యకర్తలు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అభయహస్తం..!

- రెండేళ్లుగా నిలిచిపోయిన రెన్యువల్
- ఆన్‌లైన్‌లో సభ్యుల వివరాలు మాయం
- పెండింగ్‌లోనే ప్రీమియం సొమ్ము
- మహిళలకు భరోసా ఇవ్వని అభయహస్తం



కదిరి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకొచ్చిన అభయహస్తం పథకం లబ్ధిదారులకు భరోసా ఇవ్వడం లేదు. ఈపథకంలో సభ్యుల వివరాలను ప్రతి ఏటా రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే ఈవిషయాన్ని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. గత ఐదేళ్లలో ఒకసారి మాత్రమే రెన్యువల్‌కు అవకాశమిచ్చారు. దీంతో సభ్యులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. మహిళ శక్తి సంఘాల్లోని 18నుంచి 59 ఏళ్లలోపు వారికి అభయహస్తం పథకంలో సభ్యత్వం కల్పిం చారు. ఒక్కో సభ్యురాలు ఏడాదికి కనీసం రూ.365 వాటా ధనం మరో రూ.15 రుసుం చెల్లించాలి. ఈవాటా ధనానికి సమాన మొత్తంలో ప్రభుత్వ చెల్లించి లబ్ధిదారులకు 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.ఐదువందల నుంచి రూ.2,200 వరకు పింఛన్ అందిస్తుంది.

రెన్యువల్‌కు దూరం

లబ్ధిదారులకు 60 ఏళ్లు నిండిన తరువాత పింఛన్ అందించడంతోపాటు జనశ్రీ బీమా యోజన, లబ్ధిదారుల పిల్లలకు ఉపకార వేతనాలు వంటి ప్రయోజనాలు పొందేవారు. ఈపథకంలోని సభ్యురాలి కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే రూ.30వేల నుంచి రూ.75 వేల వరకు బీమా వర్తించేది. 9, 10 తరగతులు, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు ఏటా రూ.1200 చొప్పున ఉపకార వేతనాలు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని రద్దు చేసి, బీమా సంస్థ నుంచి కంట్రిబ్యూషన్ మొత్తం వెనక్కు తీసుకున్నారు. తరువాత కేవలం పింఛన్ పథకంగానే మిగిలిపోయింది. గతంలో రెండేళ్ల ప్రీమియం రూ.750లు ఒకేసారి కట్టాలని సూచించడంతో చాలమంది రెన్యువల్ చేసుకోలేదు. ఆ తరువాత రెన్యువల్ సంగతి మరిచిపోయారు. జిల్లావ్యాప్తంగా 46,945మంది అభయహస్తంలో సభ్యులుగా ఉండగా, 18,939మంది పింఛన్ పొందుతున్నారు.

వైదొలిగినవారికి సొమ్ము అందలేదు

గతంలో ప్రీమియం చెల్లించినవారు ఈపథకం నుంచి స్వచ్ఛందంగా వైదొలగడానికి అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వేలమంది వైదొలుగుతున్నట్లు అంగీకార పత్రాలించారు. అయితే అప్పటివరకు వారు చెల్లించిన సొమ్ము తిరిగి ఇవ్వలేదు. ఇప్పటివరకు వైదొలగిన, మృతి చెందినవారి నామినీలకు సొమ్ము జమ చేయలేదు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

గత ప్రభుత్వంలో ఒకసారి మాత్రమే రెన్యువల్‌కు అవకాశమిచ్చారు. ప్రస్తుతం ఎంతమంది సభ్యులున్నారన్న సమాచారం ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. మృతిచెందిన వారి నామినీలకు, పథకం వద్దనుకున్న సభ్యులకు వారి చెల్లించిన ప్రీమియం తిరిగి చెల్లించాలి. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

\-నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ప్రతి నియోజకవర్గంలో పదివేల సౌర వెలుగులు

కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో పదివేల యూనిట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ప్రధానమంత్రి సూర్యఘర్, నియోజకవర్గాల అభివృద్ధిపై జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం అమలుపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈపథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్రం రూ.60వేలు, రాష్ట్ర ప్రభుత్వం 55వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ సోలార్ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.90తో కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలోని ఆర్డీవోలందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతి నియోజకవర్గంలో పదివేల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో విజయసారథి, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీపీఓ సమత, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు రవాణా శాఖ మంత్రి రాక

మడకశిర టౌన్, ఏప్రిల్ 25(నఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, రవాణా, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం మడకశిరకు రానున్నారు. మంత్రి ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయానికి చేసుకుని, విలేకరులతో మాట్లాడతారు. అనంతరం అక్కడే నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 10 గంటలకు గుండుమల తిప్పేస్వామి ఇంటికి వెళ్తారు. 10.30 గంటలకు జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తారు. 11 గంటలకు అమరాపురం బస్టాండు అవరణలో నూతన బస్సు సర్వీసులను ప్రారంభించనున్నారు. 11.30 గంటలకు పట్టణంలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నరు. 12 గంటలకు మడకశిర ఆర్టీసీ డిపోను సందర్శిస్తారు. 12.30కి ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియాన్ని పరిశీలిస్తారు. 1.30 గంటల నుంచి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 2 గంటలకు మడకశిర నుంచి రాయచూరుకు రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు.

మొక్కజొన్నకు ఆకుతెగులు



ఆకుతెగులు సోకిన మొక్కజొన్న పైరు

పరిగి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు ఆకుతెగులు సోకడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పరిగి చెరువుకు నీరందడంతో స్థానిక రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు మొక్కజొన్న పంటను విరివిగా సాగు చేశారు. రాత్రింపగళ్లు కంటికి రెప్పలా పంటను కాపాడుకున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఆకుతెగులు సోకింది. దీంతో తమకు తోచిన మందులు, దుకాణాల నిర్వాహకులు చెప్పిన రసాయన మందులు వాడి పంటను కాపాడుకోవడానికి ప్రయాస పడుతున్నారు. సంబంధిత అధికారులు పంట నష్టం జరగకుండా సూచనలు, సలలాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఆశాజనకంగా వరిసాగు

పరిగి చెరువుకు నీరు అందడంతో మూడు నెలల కిందట మండల వ్యాప్తంగా 700ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిగి చెరువు కింద 20ఏళ్ల కిందట ఈ స్థాయిలో వరి సాగు చేశారని, మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిలో సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. మరో 15రోజుల్లో పంట కోతకోయనున్నట్లు రైతులు పేర్కొన్నారు. అప్పటి వరకూ ప్రకృతి ప్రకోపించకుండా ఉంటే నాలుగురాళ్లు కళ్ల జూస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



వరి పైరు



ఈ చిత్రం అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీ విద్యారణ్య నగర్‌లోనిది. ఇది విద్యుత్ డి-5సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ విద్యుత్తు స్తంభం ఒక వైపు వంగిపోవడంతో విద్యుత్తు తీగలు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో స్థానికులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలు రూరల్ మండలం పాములరాయి గ్రామ సమీపంలోని పంట పొలాల్లోనిది. ఇక్కడ రెండు విద్యుత్తు స్తంభాలు ఒక వైపునకు ఒరిగిపోయాయి. దీంతో ఎప్పుడు కింద పడతాయో తెలియనీ పరిస్థితి నెలకొంది. ఒక విద్యుత్తు తీగ ఆధారంతో ఆ రెండు స్తంభాలు పడకుండా ఉన్నాయి. ఓమోస్తరు గాలి వీచినా పడిపోయే పరిస్థితి నెలకొంది. స్థానిక రైతులు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయినా వాటిని సరిచేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

వేలాడుతున్న ప్రమాదం..!

చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు

నెలకొరిగే స్థితిలో స్తంభాలు

సరిచేయడంలో అధికారుల అలసత్వం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖ అధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. నిత్యం విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మేల్కొనడం లేదు. ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రజలు, రైతులు స్థానికంగా నెలకొన్న సమస్యలను విద్యుత్తు శాఖ వర్గాల దృష్టికి తీసుకెళ్లిన పెడచెవిన పెడుతున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చేతికందేంత ఎత్తులో తీగలు

అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు..చుట్టుపక్కల ప్రాంతాల్లో నెలకొరిగే స్థితిలో విద్యుత్ స్తంభాలున్నాయి. చేతికందేంతా ఎత్తులో తీగలు వేలాడుతున్నాయి. వాటిని సరిచేయడంలో సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి క్షేత్రస్థాయిలోని లైన్‌మెన్ తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాల్సి ఉంది. తద్వారా తన పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అనంతరం ఆ అధికారులు సమస్య పరిష్కారానికి అంచనాలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడ సాగడం లేదు. కేవలం రెవెన్యూ కలెక్షన్స్, చిన్న సమస్యల పరిష్కారంతోనే లైన్‌మెన్లు, ఏఈఈలు సరిపెడుతున్నారు. సమస్యలను స్వయంగా వినియోగదారులు, రైతులు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించని పరిస్థితులు క్షేత్రస్థాయిలో నెలకొన్నాయి.

మేల్కొకపోతే.. గాల్లోకి ప్రాణాలు..

నిత్యం విద్యుత్ ప్రమాదాలతో రైతులు, ప్రజలు మరణించడం జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత శాఖ వర్గాలపై ఉంది. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో ప్రమాద స్థితిలో ఉన్న స్తంభాలు, తీగలు తెగిపోతున్నాయి. దీంతో అమాయక ప్రజలు, రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికితోడు రానుంది వర్షాకాలం. ఈలోపు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తే.. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుంటుంది.

సమస్యలను గుర్తించమని చెప్పాం

క్షేత్రస్థాయిలో విద్యుత్ పరమైన సమస్యలుంటే గుర్తించమని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఆమేరకు ఎక్కడైతే సమస్యలున్నాయో ఆప్రాంతాల్లో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అనంతపురం నగరంతోపాటు, డివిజన్ పరిధిలోని మండలాల్లో మా దృష్టికి వచ్చిన వాటిని ఇటీవల పరిష్కరించాం. ఎక్కడైన సమస్యలున్నా ఎస్టిమేషన్లు వేయడం, లేదంటే క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.



-జేవీ రమేష్, ఈఈ, అనంతపురం డివిజన్



ఈ ఫొటోలో ఉన్న విద్యుత్ స్తంభం ఆలమూరు నుంచి ఎంటీ పల్లికి వెళ్లే 11కేవీ లైన్‌వి. పొలాలలో ఇలాంటివి అనేకం ఉన్నాయి. ఓ వైపు ఒంగిపోయి, శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కేవలం విద్యుత్ లైన్ సాయంతో ఇవి నిలబడ్డాయి. ఈదురుగాలు వీస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. స్తంభాలు మార్చాలని ఓ రైతు కోరడంతో విద్యుత్ శాఖ ఏఈఈ మూడు స్తంభాలను ఎత్తించినట్లు సమాచారం. అయితే స్థానిక లైన్‌మన్ వాటిని ఇతరులకు ఇచ్చారని, ఇక్కడ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు.

గాలివాన వస్తే చీకటే..!

కూలిపోతున్న విద్యుత్ స్తంభాలు

బ్యాక్‌ఫీడ్ లేక తీవ్ర ఇబ్బందులు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

విడపనకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గాలివాన వచ్చిందంటే మండల ప్రజలు గంటలు, రోజుల తరబడి చీకట్లో మగ్గాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. కార్యాకలాపాలు స్తంభిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బ్యాక్ ఫీడింగ్ కోసం లైన్ మంజూరైంది. ఆరు నెలల క్రితం రూ.కోటి పైగా విలువైన మెటీరియల్‌ను అధికారులు డ్రా చేశారు. కానీ పనులను ప్రారంభించడం లేదు. గుంతకల్లు నుంచి విడపనకల్లుకు విద్యుత్ సరఫరా చేసేందుకు 50 ఏళ్ల క్రితం నాటిన స్తంభాలే నేటికీ ఆధారం. ఇవి ఎక్కడ పడితే అక్కడ దెబ్బతిన్నాయి. గాలివాన వచ్చిందంటే కూలిపోతున్నాయి. ఏ ప్రాంతంలో దెబ్బతిన్నాయో గుర్తించేందుకు సిబ్బంది వాగులు, వంకలు, అడవుల్లో ప్రయాణిస్తూ.. 35 కి.మీ. వెతకాల్సి వస్తోంది. ఆ తరువాత మరమ్మతులకు మరింత సమయం పడుతోంది.

గాలివాన వస్తే..

ఈ నెల 18న మండల వ్యాప్తంగా గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో గుంతకల్లు నుంచి విడపనకల్లు వచ్చే హెవీ విద్యుత్ లైన్‌లో (33/11 కేవీ) ఐదు స్తంభాలు నేలకు ఒరిగాయి. వీటిని గుర్తించేలోగా శనివారం మధ్యాహ్నం అయింది. మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాత్రి 11 గంట లు అయింది. అప్పటి నుంచి ఆదివారం మధ్యా హ్నం వరకూ అంతరాయాలతో సరఫరా చేశా రు. తిరిగి ఆదివారం సా యంత్రం గాలివాన రావడం తో అంచనహాలు వద్ద మూ డు స్తంభాలు విరిగిపోయాయి. వాటిని గుర్తించేందులోగా సోమవారం మధ్యాహ్నం అయ్యింది. ఇలా.. శుక్రవారం సాయంత్రం మొదలైన విద్యుత్ సరఫరా అంతరాయం.. సోమవారం రాత్రి వరకూ కొనసాగింది.

లైన్ మంజూరు అయినా..

చాబాల సబ్ స్టేషన్ నుంచి ధర్మపురి, జనార్దనపల్లి మీదుగా విడపనకల్లు మండలంలోని మాళాపురం సబ్ స్టేషన్‌కు 33/11 కేవీ లైన్ మంజూరు అయింది. దీని ఏర్పాటు కోసం 12 కి.మీ. దూరానికి రూ.కోటికి పైగా విలువైన విద్యుత్ సామగ్రిని విద్యుత్ శాఖ అధికారులు డ్రా చేశారు. కానీ ఆరు నెలలు గడిచినా పనులను ప్రారంభించలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్ తెలిపారు. మూడోసారి గుత్తికి చెందిన కాంట్రాక్టర్ ముందుకొచ్చారని, టెండరు ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కొంత మెటీరియల్ డ్రా చేశామని, మరికొంత రావాల్సి ఉందని అన్నారు. ఆ మెటీరియల్ రాగానే పనులు ప్రారంభిస్తామని అన్నారు.

అన్నీ ఇబ్బందులే..

విద్యుత్ సరఫరా లేనికారణంగా సెల్‌ఫోన్‌లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు బంద్ అయ్యాయి. మిక్సీలు, గ్రైండర్లు పనిచేయక ఇళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హోటళ్లను మూసేశారు. కొన్నేళ్లుగా ఈ సమస్య కొనసాగుతోంది. గుంతకల్లు లైన్‌లో అంతరాయం ఏర్పడితే చుట్టు పక్కల ఉన్న సబ్‌స్టేషన్ల నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు ఉండాలి. కానీ అధికారులు పట్టించుకోలేదు. విడపనకల్లు మండలానికి పాల్తూరు సబ్ స్టేషన్, వజ్రకరూరు మండలంలోని చాబాల సబ్‌స్టేషన్, ఉరవకొండ సబ్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ఇచ్చే ఏర్పాట్లు చేసుకునే వెసులు బాటు ఉంది. విడపనకల్లు సబ్ స్టేషన్‌కు తప్ప మిగిలిన మండలాల సబ్‌స్టేషన్‌లకు బ్యాక్ ఫీడ్ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు ఉన్నాయి.

కల్యాణ వైభోగం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆదిమూర్తి నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేడుకల్లో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భూమి సారం తెలుసుకుందాం..!



అనంత భూసార పరీక్షా కేంద్రం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏ పంట పెట్టాలన్నా తొలుత భూసారం తెలుసుకోవాలి. భూసారం మేరకు పంటలు వేసి, ఎరువులు, మందులు వాడినపుడే మేలైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో భూసార పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మే 25వతేదీదాకా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. భూసార పరీక్షాకేంద్రంలో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహించి, ఖరీఫ్‌లోగా సాయిల్ హెల్త్ యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు మండలాల వారీగా ఎన్ని మట్టి నమూనాలు పంపాలన్న వివరాలను ఆయా ఏఓలకు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు... రైతు సేవాకేంద్రంలో సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో మట్టి నమూనాలు సేకరించే పొలం రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆర్‌ఎస్‌కే సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి, రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు తీయాలి. తర్వాత అక్కడే సదరు రైతుతో సెల్ఫీ దిగి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత సాయిల్ హెల్త్ కార్డు నంబరు వివరాలు సదరు రైతు సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ నంబర్ ఆధారంగానే మట్టి పరీక్షలు చేసిన తర్వాత యాప్‌లో ఫలితాలను భూసార పరీక్షాకేంద్రం అధికారులు అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత భూసార హెల్త్ కార్డులను మండల వ్యవసాయాధికారి ద్వారా రైతులకు అందజేస్తారు.



భూసార పరీక్ష కేంద్రంలోని పరికరాలు

ఉపయోగాలు..

- పొలంలో వివిధ పోషకాల స్థాయి తెలుస్తుంది.
- పొలాల్లో ఏయే పంటలు పండించుకోవచ్చో తెలుసుకోవచ్చు.
- ఎరువులను ఎంత మోతాదులో.. ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేల సమస్యలైన కారు చౌడు, పాల చౌడు స్థితి తెలుస్తుంది.
- ఎరువుల వాడకంపై అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు.
- అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుంది.

సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పంటకోత తర్వాత మట్టి నమూనాలు సేకరించాలి. వేసవిలో, పంటలేని సమయాల్లోనే మట్టి నమూనాలు సేకరించాలి. ఎరువులు వేసిన తర్వాత నెల రోజులదాకా మట్టి నమూనాలు తీయకూడదు. నీరు పెట్టిన తర్వాత తీయకూడదు. నీడ పడే ప్రదేశాలు, నీటి ముందు ప్రాంతాలు, ఎరువు కుప్ప, గట్లు, చెట్లు దగ్గర మట్టి నమూనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. పొలానికి ఒక నమూనా మాత్రమే తీయాలి. పొలం ఎక్కువ విస్తీర్ణంలో ఉంటే ప్రతి 2 నుంచి 5 ఎకరాలకు ఒకటి సేకరించొచ్చు. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేలవాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాల్లో తేడా కనిపిస్తే అందుకు సంబంధించిన అన్ని నమూనాలు ఆయా పొలాల నుంచి తీసుకోవాలి.

సేకరించే విధానం..!

పైరు పంటలకు 6 అంగుళాల లోతులో మట్టి నమూనా తీయాలి. పండ్ల తోటల్లో 5 నుంచి 6 అంగుళాల వరకు ప్రతి అడుగుకు నమూనా తీసుకోవాలి. చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి. నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు తదితర వాటిని తీసివేయాలి. ఆగర్‌గానీ, పారగానీ ఉపయోగించాలి. పొలంలో వి ఆకారంతో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారగానీ, తాపీతోగానీ మట్టిని సేకరించాలి. పొలంలో 8-10 చోట్ల ఈ పద్ధతిలో మట్టి తీసుకోవాలి. సేకరించిన మట్టినంతటినీ కలిపి నేల మీద పరిచి, 4 భాగాలు చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకుని, మిగిలిన మట్టిని పడేయాలి. ఇలా అర కిలో మట్టి నమూనాను సేకరించాలి. దానిని గుడ్డగానీ, పాలిథీన్ సంచిలోగానీ భద్రపరచాలి. రైతు పేరు, చిరునామా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటల వివరాలు నమోదు చేయాలి. గత మూడేళ్లలో ఆయా పొలాల్లో వాడుతున్న ఎరువులు, వేయాల్సిన పంటలు, మట్టి నమూనా సేకరించిన తేదీ తదితర వివరాలను జత చేయాలి. ఇలాంటి సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రంలో అందజేయాలి.

పరీక్షలు ఎందుకంటే..?

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి, ఎంత మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం. భూసార పరీక్షలు చేయించి, వాటిని ఆచరించడం ద్వారా అనేక లాభాలున్నాయి. పంటలో స్థిరమైన దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చు. అధిక దిగుబడులు పొందాలన్న ఆలోచనతో రైతులు అనవసరంగా ఎక్కువ స్థాయిలో ఎరువులు వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడులు రాకపోగా.. చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం, చౌడు తదితర సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటిని అధిగమించాలంటే నేలకు సంబంధించిన స్థితిగతులను తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఇందుకోసం నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలియజేసే భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాల ఆధారంగా అవసరం మేరకే ఎరువులు వాడుకోవాలి. అప్పుడే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఈ ఏడాది జిల్లాలో 25,107 భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. మే 25వ తేదీదాకా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది నిర్దేశించిన మేరకు మట్టి నమూనాలు సేకరించి, అనంతపురం భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేస్తాం. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందిని రైతులు సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత సిబ్బంది.. రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, రైతులతో కలిసి సెల్ఫీ తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



- రోజాపుష్పలత, ఏడీ, అనంతపురం భూసార పరీక్షాకేంద్రం


రిలీఫ్..!

టీచర్లకు తప్పిన యాప్ కష్టాలు

అన్నింటికీ ఒకే యాప్

అందుబాటులోకి లీప్

ఉపాధ్యాయ వర్గాల హర్షం



ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. ఉపాధ్యాయులకు పని భారం తగ్గించేలా పలు చర్యలు చేపట్టింది. ఇటీవలి వరకు వివిధ యాప్‌లలో వివరాల నమోదుకు ఆపసోపాలు పడేవారు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. తాజాగా ఒకే యాప్‌లో అన్నిసేవలు, విధులు నమోదు చేసుకునేలా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో సమగ్ర యాప్‌ను వారం రోజుల క్రితమే అందుబాటులోకి తీసుకొచ్చారు. పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఖాళీల వివరాలు, ప్రభుత్వ సమాచారం, గవర్నెన్స్, డ్యాష్ బోర్డు నిక్షిప్తం చేశారు. దీని పనితీరును ఉపాధ్యాయులు పరిశీలిస్తున్నారు. పదో తరగతి ఫలితాలు సైతం ఈ యాప్‌లో నిక్షిప్తం కానున్నాయి. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 2,098 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వీటిలో 1,48,453 మంది విద్యార్థులు చదువుతున్నారు. 33,590 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

గతంలో ఎన్నో సమస్యలు

గత వైసీపీ పాలనలో ఒక్కో వివరం నమోదుకు ఒక్కో యాప్ తీసుకొచ్చారు. దీంతో అన్ని యాప్‌లలో వివరాల నమోదుకు టీచర్లు తిప్పలు పడేవారు. నెట్‌వర్క్, సర్వర్ మొరాయించడం వంటి సమస్యలు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారేవి. పాఠశాల సమయానికి ముఖ ఆధారిత హాజరు వేయాలంటే ఇబ్బందులు పడేవారు. విద్యార్థుల హాజరు, వంట నిర్వహణ, మరుగుదొడ్ల చిత్రాల అప్‌లోడ్, సెలవుల నమోదుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పాఠ్యపుస్తకాల పంపిణీ, మనబడి నాడు-నేడు, పీఎంశ్రీ తదితర వివరాల నమోదుకు వేర్వేరు యాప్‌లు ఉండేవి. వాటి ఐఈడీలు, పాస్‌వర్డ్‌లు గుర్తు పెట్టుకోలేక, సెలవు రోజుల్లో ఇతరులకు ఆ వివరాలు ఇవ్వలేక ఇబ్బందులు పడేవారు. ముఖ హాజరుకు నెట్‌వర్క్, సర్వర్ బిజీతో గంటల తరబడి వేచిచూసేవారు. తాజాగా ముఖ ఆధారిత హాజరు గుర్తింపు సంఖ్య పాస్‌వర్డ్‌తో లీప్ యాప్‌లో లాగిన్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. యాప్‌లోనే స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలున్నాయి. సాంకేతికంగా మెరుగుపరిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని టీచర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లీప్ యాప్.. టీచర్లకు ఎంతో ప్రయోజనం

ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన లీప్ యాప్‌తో టీచర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నారు. టీచర్లకు సంబంధించి ఉత్తర్వులు, బదిలీలు, నోటిఫికేషన్లు వంటివి పొందుపరచడం ద్వారా తాజా సమాచారం తెలుసుకోవచ్చు. బడులకు సంబంధించి అన్ని కార్యకలాపాలు దీని ద్వారానే నిర్వహిస్తాం.

- కిష్టప్ప, జిల్లా విద్యాధికారి

మంత్రి గారూ.. ఇటు చూడరూ..!

మంత్రి ఇలాఖాలో ఇన్‌చార్జి అధికారులే దిక్కు

కూడేరు, విడపనకల్లులో తహసీల్దార్, వజ్రకరూరులో ఎంపీడీఓ పోస్టులు ఖాళీ

కుంటుపడుతున్న పాలన



ఉరవకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాలన కుంటుపడుతోంది. నియోజకవర్గంలో తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషాను కూడేరుకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన కూడేరులోనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఉరవకొండలో తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడేరులో 8 నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. సీఎస్ డీటీ, సీనియర్ అసిస్టెంట్లు కూడా లేరు. బెళుగుప్ప నుంచి ఆర్ఐ బదిలీపై వచ్చిన కొన్నిరోజులకే దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఉరవకొండలో కూడా డిప్యూటీ తహసీల్దార్ సెలవులో ఉన్నారు. విడపనకల్లు మండలంలో తహసీల్దార్ రెండు నెలల క్రితం ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో డీటీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వజ్రకరూరులో ఎంపీడీఓ లేకపోవడంతో ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు. ఉరవకొండతోపాటు వజ్రకరూరు రవిప్రసాద్ రెండుచోట్ల విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ పర్యవేక్షణ లేకపోవడంతో కార్యాలయంలోని సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ కూడా ఇన్‌చార్జి అధికారే ఉన్నారు. ఆయన తాడిపత్రితోపాటు ఇక్కడ పనిచేస్తున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలి

రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడేరు, ఉరవకొండకు తహసీల్దార్ ఒక్కరే కావడంతో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి. రైతులు, ప్రజలు సర్టిఫికెట్లు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో తహసీల్దార్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

-రంగారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకుడు

ఇన్‌చార్జి అధికారులతోనే..

నియోజకవర్గంలో ఎంపీడీవో, తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు.

- విరుపాక్షి, సీపీఎం నాయకుడు

క్రైం కార్నర్

గొలుసు.. కమ్మలను లాక్కెళ్లిన దొంగలు



గాయపడిన జయమ్మ

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి వద్ద కిష్టప్ప ఫామ్‌హౌస్ సమీపంలో జయమ్మ అనే వృద్ధురాలి మెడలోని గొలుసు, కమ్మలను దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయమ్మ సంతలో జామకాయలు అమ్ముకుని జీవిస్తోంది. శుక్రవారం రైల్వే బ్రిడ్జివద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. జామకాయలు కొంటున్నట్లు నటించి ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవిలోని కమ్మలను లాక్కుని పరారయ్యారు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు వేగంగా వెళ్లిపోయారు. గాయపడిన జయమ్మను సోమందేపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈమె సోమందేపల్లి స్నేహలతనగర్‌లో నివాసముంటుంది. రోజూ రైల్వే బ్రిడ్జి వద్దకెళ్లి వ్యాపారం చేసుకుంటుండేది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



వీరాంజనేయులు (ఫైల్)

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన యువరైతు సాకే వీరాంజనేయులు (31) విద్యుదాఘాతంతో శుక్రవారం మరణించాడు. ఈనెల 24న సాయంత్రం తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేస్తుండగా కరెంటు షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన యువ రైతును అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శుక్రవారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరాంజనేయులుకు భార్య రాజేశ్వరి, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వృద్ధుడు..



నరసింహుడు (ఫైల్)

రాప్తాడు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తలారి నరసింహుడు (65) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. తలారి నరసింహుడు రోజూ ఉపాధి పనులకు వెళ్లేవాడు. ఈక్రమంలోనే సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందిన తరువాత ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎండవేడిమి పెరగడంతో తట్టుకోలేక శుక్రవారం ఇంట్లోనే మృతి చెందాడు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, గోనిపట్ల శీనా, పంపు ఇంద్ర తదితరులు తలారి నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యం



మంజునాథ్

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన మంజునాథ్ ఈనెల 13నుంచి కనబడుటలేదని కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మంజునాథ్ 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. పలు చోట్ల గాలించినా ప్రయోజనం లేదన్నారు. ఆచూకీ తెలిస్తే 6300661634, 7207054074 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అత్తింటి వేధింపులు భరించలేకున్నా..!

- ఆత్మహత్య చేసుకుంటున్నా.. న్యాయం చేయండి
- సోషల్ మీడియాలో తాడిపత్రివాసి సెల్ఫీ వీడియో



వీడియోలో మాట్లాడుతున్న విశ్వనాథ్

తాడిపత్రి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అత్తింటివారి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తాడిపత్రి జయనగర్ కాలనీకి చెందిన విశ్వనాథ్ అనే వ్యక్తి అధికారులను కోరాడు. అతని సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. అందులోని వివరాల మేరకు.. కడప జిల్లా వీరపునాయనిపల్లి మం డలం అలివేల ఓబాయపల్లికి చెందిన గంగమ్మ, రాంప్రసాద్ దంపతుల కూతురు హరిణిని విశ్వనాథ్ మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. వివాహమైన ఏడాది నుంచి విశ్వనాథ్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని అత్తింటివారు అతని భార్య హరిణికి చెప్పారు. అత్త గంగమ్మ, ఆమె కుమారుడు వంశీకృష్ణ, ఆ ఊరి పెద్దలు విశ్వనాథ్‌ను వేధించారు. మానసిక క్షోభను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఆ దృశ్యాలను లైవ్‌లో చూపిస్తానని విశ్వనాథ్ పేర్కొన్నాడు. తన చావుకు కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తన లాంటి మగవారికి అన్యాయం జరగకుండా, వారికి బుద్ధి వచ్చేలా చర్యలు ఉండాలని కోరాడు. తన బాధను అర్థం చేసుకోవాలని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరాడు. విశ్వనాథ్ వీడియోను చూసిన అతని భార్య హరిణి, అత్త గంగమ్మ తాడిపత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాగైనా తన భర్త ఆచూకీ తెలపాలని హరిణి పోలీసులను కోరింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆర్డీటీ సెట్ రద్దు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సెట్‌ను ఈ ఏడాది రద్దు చేసినట్లు ఆ సంస్థ శుక్రవారం తెలిపింది. దశాబ్ద కాలానికిపైగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇంటర్‌లో కార్పొరేట్ విద్య అందించేందుకు ఆర్డీటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్‌సీఆర్ఏ సమస్య నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది వేలాది మంది పేద విద్యార్థులకు నష్టం జరగనుంది. తప్పని పరిస్థితుల్లో ఆర్డీటీ సెట్‌ను రద్దు చేసినట్లు ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు.



వాహనాలకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి



జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

కదిలింది.. ప్రేమ రథం

సత్యసాయి బోధనల ప్రచారానికి తరలిన ప్రేమప్రవాహిని రథాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి అందించిన ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక బోధనలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథాలను శుక్రవారం ప్రారంభించారు. ప్రశాంతినిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. మాజీ మంత్రి గీతారెడ్డి వాహనాలకు పూజలు చేశారు. భక్తుల మంగళవాయిద్యాలు, భక్తిపాటలతో ప్రచార రథాలు బయల్దేరి వెళ్లాయి. వీటి ద్వారా 18నెలల పాటు 5 జోన్ల పరిధిలో ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో సత్యసాయి తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తారు. నవంబరు 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రచారం సాగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 5 రథాలను తయారుచేశారు. రథంలో సత్యసాయి చిత్ర పటం ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. భక్తుల దర్శనం కోసం సత్యసాయి పాల రాతి పాదకులను రథంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సేవా సంస్థల ప్రతినిధులు లక్ష్మణరావు, వెంగళరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకి ఐసీఐసీఐ ఫౌండేషన్ సహకారం

రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల వరకు అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అభివృద్ధికి సహకారం అందించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హెల్త్‌కేర్, స్కిల్స్, ల్యాబ్స్, ఇంకుబేషన్ సెక్టార్లను అభివృద్ధి చేసేందుకు ఐసీఐసీఐ సంస్థ సుముఖత తెలిపింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల వరకు నిధులు వెచ్చించనున్నారు. తక్షణం రూ.50లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్‌లో ల్యాబ్, హాస్టల్స్‌లో ఫుడ్ వేస్టేజ్, హెల్త్‌సెంటర్‌లో ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేసేలా వర్సిటీ అధికారులు ప్రతిపాదించారు. ఈ పనులను పూర్తిచేసిన అనంతరం మిగిలిన నిధులతో ఇంకుబేషన్‌లో స్టార్టప్స్, నైపుణ్యాల పెంపు, ల్యాబ్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్యను ఐసీఐసీఐ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి శరత్‌కుమార్ కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు మాట్లాడుతూ.. సాంకేతిక విద్యారంగంలో సానుకూల పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇందులో భాగంగా జేఎన్‌టీయూ అభివృద్ధికి వివిధ కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే కియ తదితర సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ సంస్థ సీఎస్ఆర్ కింద రూ.5కోట్ల వరకు నిధులు వెచ్చించి సెక్టార్లవారీగా అభివృద్ధి చేసేందుకు ముందకు వచ్చిందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి, సంస్థ ప్రతినిధులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

యుక్తవయసు బాలికల భద్రతపై శ్రద్ధ



మాట్లాడుతున్న నరసింహమూర్తి

అనంతపురం విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు ఇతర సామాజిక దురాచారాల నుంచి యుక్తవయసు బాలికలకు భద్రత కల్పించాలనీ, అందుకు అన్ని వ్యవస్థలు ఐక్యంగా శ్రమించాలని యునిసెఫ్ ప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల అధికాలతో కిశోరి వికాసంపై శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యునిసెఫ్ ప్రతినిధులు నరసింహమూర్తి, మేరీ జోన్స్ మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు కలిసికట్టుగా బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఆ దిశగా అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, అన్నమయ్య డీఎల్‌పీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీసీ శైలజ మాట్లాడుతూ..... యుక్తవయసు బాలికల సాధికారత కోసం క్యాలెండర్ ప్రకారం కార్యక్రమలు చేయాలని సూచించారు. టీనేజీ ప్రెగ్నెన్సీని నియంత్రిచాలని సూచించారు. బాల్యవివాహాల జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రణాళికతతో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలు చేయాలన్నారు. బడిబయట తిరిగే పిల్లలను గుర్తించి, స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పీడీ శ్రీదేవి, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్లు, పలువురు సీడీపీఓలు చైల్డ్‌లైన్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు చెల్లింపు

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు శనివారం నుంచి చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 19 నుంచి 24వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయ తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలుంటాయన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మే 26 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. పరీక్షల ఫీజు నెలాఖరు వరకూ ఫైన్ లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.25 ఫైన్‌తో మే1, 2 తేదీల్లోపు, రూ.50 ఫైన్‌తో మే 3, 4 తేదీల్లోపు, తత్కాల్ కింద మే 5వతేదీలోగా చెల్లించవచ్చన్నారు. టెన్త్‌కు ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు సబ్జెక్టుకు రూ. 150, ఇంటర్ ప్రాక్టికల్స్‌కు రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు ఓపెన్ స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లనుగానీ, ఓపెన్‌స్కూల్ కార్యాలయంలోగానీ సంప్రదించాలన్నారు.

ఆర్జేడీ బ్లాగ్‌లో జోన్-4 సీనియారిటీ లిస్టు

అనంతపురం విద్య ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా rjdsekadapa.blogspot.com లో ఉంచినట్లు ఆర్జేడీ శామ్యూల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తమ సీనియారిటీ జాబితాను పరిశీలించాలని సూచించారు. అన్ని జిల్లాల విద్యా శాఖాధికారులు సైతం సీనియారిటీ జాబితాలను డీఈఓ బ్లాగ్స్‌లో అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

శభాష్.. వర్ష..!

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పులమతి విద్యార్థిని ఎంపిక



వర్ష

లేపాక్షి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వర్ష జాతీయస్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బారావు శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలో శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వర్ష రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడంతో వర్షను ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

పింఛన్ భరోసా..

- భర్త మరణిస్తే.. భార్యకు వర్తింపునకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 7,021 మందికి లబ్ధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భర్తను పోగొట్టుకున్న వారికి కొత్త ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ భర్త మరణిస్తే... భార్యకు వర్తింపజేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఇది అమలులో ఉంది. 2023 డిసెంబరు 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎంతమంది పింఛన్ పొందుతూ చనిపోయారో వివరాలు సేకరించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. చనిపోయిన లబ్ధిదారుడి భార్యకు పింఛన్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 3,775 మంది, శ్రీసత్యసాయిలో 3,246 మంది మొత్తంగా 7,021 మంది పింఛన్ పొందుతూ మరణించినట్లు చెబుతున్నారు. వారి భార్యలకు పింఛన్ అందించనున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మృతిచెందిన భర్తల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయనీ, వారు పొందే పింఛన్ ఐడీ నంబర్లు, పేరు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు చెప్పారు.

ఈఓఆర్డీ, ఏఓలకు ఉద్యోగోన్నతి

- తాత్కాలిక ఎంపీడీఓలుగా నియామకం

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ ఎంపీడీఓలు(ఈఓఆర్డీలు), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు తాత్కాలిక ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు పీఆర్ కమిషనర్ క్రిష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో కొందరిని ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. అనంతపురం జిల్లాకు చెందిన డిప్యూటీ ఎంపీడీఓలు శివాజి రెడ్డి, జిలానీ బాషాను, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన వెంకటలక్ష్మమ్మ, కర్నూలు జిల్లాకు చెందిన సూర్యనారాయణ, కర్నూలు జిల్లాకు చెందిన ఏఓ విజయసింహా, అనంతపురం జిల్లాకు చెందిన ఏఓ ధనుంజయనాథ్ అనంతపురం జిల్లాకు కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన డిప్యూటీ ఎంపీడీఓలు నాగేశ్వర్‌రావు, కేశవరెడ్డి, నసీమా, మమత దేవి, నటరాజ్‌ను, ఏఓ రెడ్డప్పను అదే జిల్లాకు కేటాయించారు. వీరికి స్థానాలను కేటాయించాలని జడ్పీ సీఈఓను కమిషనర్ ఆదేశించారు.

పాత సర్క్యులర్‌ను అమలు చేయాలి

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి
- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో సాధించుకున్న 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దామోదరరావు, యూనియన్ కార్యదర్శి నరసయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్ పెట్టిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ఆర్టీసీలో క్లాస్ 4 ఉద్యోగుల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు 3500 మంది ఉద్యోగులు ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. గత 12ఏళ్లగా ఆర్టీసీలో కారుణ్య నియామకాలు తప్ప ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు. దీంతో ప్రస్తుతం ఆర్టీసీలో వివిధ కేటగిరీలకు సంబంధించి దాదాపు 11వేలు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఉద్యోగులకు అరియర్స్, డీఏ బకాయిలుతో పాటు పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా సరైన వైద్యసౌకర్యాలు అందక సంవత్సరానికి దాదాపు 350 మంది వరకు చనిపోతున్నందున పాత పద్ధతిలో ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో హయ్యర్ పెన్షన్ కోసం యూనియన్ తరఫున కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, కడప జోన్ ఈయూ అధ్యక్షుడు కేకేకుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జీవైసీరావు, జోనల్ నాయకులు శేఖర్, అరుణమ్మ, జిల్లా నాయకులు నారాయణస్వామి, ఆర్ఎస్‌రెడ్డి, ఏవీవీప్రసాద్, రమణప్ప, కేఎస్‌వాసులు, నరసింహులు, సుమోశీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

సమీక్షకు వివరాలతో రావాలని తెలియదా..?

- ఏడీసీసీ బ్యాంకు అధికారులపై జేసీ అసహనం



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'పూర్తి వివరాలతో సమీక్షా సమావేశాలకు రావాలని తెలియదా..' అని ఏడీసీసీ బ్యాంకు అధికారులపై జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ శర్మ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. బ్రాంచ్‌లు, వాటి పరిధిలోని సొసైటీల వారీగా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించట్లేదనీ, అధికారులు ఇలా నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా అని ప్రశ్నించారు. తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో రావాలనీ, పురోగతి ఉండాలని సూచించారు. రైతులకు రుణాల మంజూరు,రికవరీ, డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలన్నారు. అనంతరం డీసీఎంఎస్‌లో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా సహకార శాఖాధికారి కృష్ణానాయక్, అనంతపురం డీఎల్‌సీఓ ప్రభాకర్ రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, డీజీఎంలు ఏబీ రాంప్రసాద్, విజయచంద్రారెడ్డి, సుఖదేవ బాబు, డీసీఎంఎస్ మేనేజర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

యూపీఎస్, ఎన్‌పీఎస్ వద్దు

- సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ డిమాండ్



క్రూ కంట్రోల్ లాబీ వద్ద ఆందోళన చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొత్త పెన్షన్ (ఎన్‌పీఎస్), యూనిఫైడ్ పెన్షన్ (యూపీఎస్)ను రద్దుచేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ (ఎల్ఆర్ఎస్) బ్రాంచ్ నాయకులు డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై ఎంప్లాయీస్ సంఘ్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ లాబీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి సుభానుల్లా మాట్లాడుతూ.. రైలింజన్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను తొలగించాలని, లోకోలు ఫాగ్ సేఫ్టీ డివైజ్‌లను ఏర్పాటు చేయాలని, రన్నింగ్ స్టాఫ్‌పై పని ఒత్తిడి తగ్గించాలని, హైస్పీడ్ రైళ్లలో విధులను నిర్వహించే రన్నింగ్ సిబ్బందికి అదనపు అలవెన్సు ఇవ్వాలని, పని సమయాల్లో భోజన వేళలు, వాష్ రూం వేళలను పాటించాలని డిమాండ్ చేశారు. 25 శాతం కి.మీ. అలవెన్సును 50 శాతం డీఏ కంటే అధికంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల నమోదుపై దృష్టి పెట్టండి

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులతో ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో శుక్రవారం అనంతపురం ఏడీఏ రవితో కలిసి డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గడువులోగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా ఏఓలు పర్యవేక్షించాలన్నారు. అర్హులైన రైతులకు యాంత్రీకరణ పరికరాలు మంజూరు చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్‌లో విత్తన పంపిణీతోపాటు ఎరువులకు సంబంధించి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి, పొరబాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎల్‌డీఎంగా నరేష్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్‌డీఎంగా నరేష్‌రెడ్డి నియమితులయ్యారు. కెనరాబ్యాంకు ముంబై సర్కిల్ పరిధిలోని పూణేలో మేనేజర్‌గా పనిచేస్తున్న విజయవాడకు చెందిన నరేష్‌రెడ్డిని అనంతపురం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎల్‌డీఎం నరసింహారావును హైదరాబాద్‌కు బదిలీ చేశారు. సోమవారం నరసింహారావు రిలీవై, నరేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

మూతిపుండ్ల వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి

ఇంటర్వ్యూ interview



కదిరి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో గొర్రెలు, మేకలకు మూతిపుండ్ల వ్యాధి ఎక్కువగా సోకుతూ ఉంటుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఆ జీవాలు మృత్యువాత పడే ప్రమాదముంది. దీనిపై పూర్తి వివరాల కోసం పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డితో చేసిన ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న : మూతిపుండ్ల వ్యాధి గురించి వివరిస్తారా..?

జవాబు : మూతిపుండ్ల వ్యాధి ఓ వైరస్ ద్వారా జీవాలకు అతి వేగంగా వ్యాపిస్తుంది. దీన్ని గజ్జిమూతి వ్యాధి, కంఠాజీయోస్, ఎప్తిమా అని కూడా అంటారు. గొర్రెలకంటే మేకల్లో ఈ వైరస్ అధికంగా కనిపిస్తుంది.

ప్రశ్న : ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ?

జవాబు: ఇది నేరుగా లేక నోటి దగ్గర పగిలిన చర్మగాయాల ద్వారా లోనికి ప్రవేశిస్తుంది. వైరస్‌తో కలుషితమైన మేత.. లేదా తొట్లల్లోని నీటి ద్వారా వ్యాపించవచ్చు. ఇది ఒక జీవి నుంచి మరో జీవికి వేగంగా వ్యాపిస్తుంది.

ప్రశ్న: లక్షణాలు ఎలా ఉంటాయి ?

జవాబు: వైరస్ ఆశించిన మూడు, నాలుగు రోజుల తరువాత పెదవులు, నోటిచుట్టు బుడిపెలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి చీము పట్టి, పగిలి గాయాలు అవుతాయి. ఆ ప్రాంతంలో గాయం నుంచి రక్తం కారుతుంది. రెండు నుంచి నాలుగు వారాలకు గాయాలు మాని, గట్టిగా బొబ్బలా మారి రాలిపోతాయి. వీటిని చేతితో తాకరాదు.

ప్రశ్న: చికిత్స ఎలా ?

జవాబు: ఈ వ్యాధికి వ్యాక్సిన్ మనదేశంలో అందుబాటులో లేదు. తల్లి నుంచి పిల్లలకు, పిల్లల నుంచి పాలు తాగే సమయంలో తల్లికి సోకుతుంది. పాలు కాచ్చి చల్లార్చి సీసాతో తాగించాలి. రాలిపోయిన బొబ్బలు గమనించి, షెడ్‌కు దూరంగా పారవేసి, కాల్చేయాలి.

ప్రశ్న : నివారణ చర్యలు

జవాబు: లక్షణాలు కనిపించిన జీవాన్ని మంద నుంచి వెంటనే వేరు చేయాలి. తొలిరోజు నుంచి చికిత్స చేయాలి. అశ్రద్ధ వహిస్తే జీవాలు మృత్యువాత పడే ప్రమాదముంది. గాయాలను పోటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి యాంటీబయోటిక్ లేపనం పూయాయి. పశువైద్యులతో చికిత్స అందించాలి.

న్యూస్ బాక్స్

దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పించన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య పించన్ పొందుతూ చనిపోయిన వారి ఉంటే వారి భార్యలు పించన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30లోగా సచివాలయాల్లో ఆ దరఖాస్తులు అందచేయాలని, మే1న కొత్త పించన్ మంజూరు అవుతుందని తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుక్కపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం తహసీల్దార్ పోస్ట్ వారం రోజులుగా ఖాళీగా ఉంది. దీంతో పలు సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన గ్రామీణులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతి 'సారూ.. యాడుండారు' అన్న శీర్షికతో వార్త ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన ఆర్డీఓ సువర్ణ బుక్కపట్నం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ షబనంను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

20న దేశవ్యాప్త సమ్మె

ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ఈ సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించిన వారు మాట్లాడారు. 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా కుదించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తోందని, దీన్ని వ్యతిరేకిస్తూ ఈ సమ్మె చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండలకో కన్వీనర్ అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ పాల్గొన్నారు.

కేశాపురంలో గ్రామ సందర్శన



కేశాపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మండలంలోని కేశాపురం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని ఎస్పీ వీ.రత్న శుక్రవారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు గొడవలు వీడి ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తుపదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మహిళల, పిల్లల భద్రతకు శక్తి యాప్‌ను వారిరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లౌడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, కొత్తచెరువు పోలీసు స్టేషన్ సీఐ సురేష్ ఎస్సై లింగన్న, కృష్ణమూర్తి, కళాబృందాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో కొత్తచెరువు

కొత్తచెరువు ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు నెహ్రూ నగర్‌లో విద్యుత్ తీగలపై చెట్టు పడింది. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ముందే వేసవి .. ఆపై కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఉక్కకు అల్లాడిపోయారు. రాత్రి 11 గంటలైనా కరెంట్ రాలేదు. ఉదయం వరకూ వచ్చే సూచనలు కనిపించడంపోవడంతో ఈ రాత్రి జాగారం తప్పదని ప్రజలు వీధులు, మిద్దెలపైకి వెళ్లి ఉపశమనం పొందారు.




కరెంట్ లేని కొత్తచెరువు

అంగట్లో సచివాలయ సర్టిఫికెట్లు

అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్న మాజీ వలంటీర్

బుక్కపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో మాత్రమే లభించే సచివాలయ ధ్రువీకరణ పత్రాలు అంగట్లో సరుకులా మారాయి. మండలంలోని మారాల గ్రామంలోని మాజీ వలంటీర్.. ఓ సచివాలయ ఉద్యోగితో కుమ్మక్కై కలిసి తన ప్రైవేటు కంప్యూటర్ నెట్ సెంటర్ ద్వారా వందల సంఖ్యలో ఈ ధ్రువపత్రాలను బహిరంగంగా విక్రయిస్తున్నాడు. వార్డు సచివాలయాలు, మీసేవల్లో మాత్రమే అధికారికంగా ఇవ్వాల్సిన వన్‌బీ సర్టిఫికెట్లను ప్రైవేటు వ్యక్తులు ద్వారా అందిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సచివాలయంలో రూ.10కి మంజూరు చేయాల్సిన ఈ ధ్రువపత్రాలను రూ.వంద తీసుకుని ఇస్తున్నారు. ఈ పత్రాలపై రాజముద్ర.. హాలోగ్రామ్‌లతో ఇస్తుండటం విశేషం. దీనిపై ఎంపీడీఓ శ్రీనివాసులను వివరణ కోరగా.. వన్‌బీ అంశం రెవెన్యూ శాఖకు సంబంధించిందని, ఇందులో తమ ప్రమేయం ఉండదని అన్నారు.



నెట్ సెంటర్ ద్వారా పొందిన వన్‌బీ సర్టిఫికెటు





ఓడీసీ : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు, తనకల్లు : రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అర్హులకు ఇంటి పట్టాలివ్వాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులకు ఇంటిపట్టాలివ్వాలని తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, వివి రమణ మాట్లాడుతూ.. గతంలో వైసీపీ ప్రభుత్వం పేదలకు అరకొరగా ఇళ్లస్థలాలను మంజూరు చేసిందని, ఆ పట్టాలు కూడా అర్హులకు అందలేదని ఆరోపించారు. నూతన ప్రభుత్వమైనా స్పందించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుళ్లాయప్ప, నాయకులు అంజి, శేఖర్, వెంకటేష్, సాయిలీలా పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని అర్హులు ఇంటి పట్టాల కోసం ఐదేళ్లుగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన వారు బైటాయించారు. తనకల్లు సర్వేనెంబర్ 793లో పేదలకు పట్టాలు కేటాయించాలన్నారు. కార్యాలయంలోకి ఎవరిని వెళ్లకుండా అడ్డుకున్నారు. వినతిపత్రాన్ని కార్యాలయ అధికారి నాగేశ్వరరావుస్వామికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, జిల్లా కమిటీ సభ్యుడు రమణ, రైతు సంఘం నాయకుడు ఎస్‌వీ రమణ, సీఐటియూ నాయకుడు ఒట్టెందు వేవన్న, కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసులు, చలపతి, నాగేంద్రనాయుడు పాల్గొన్నారు.

బదిలీ అయిన న్యాయాధికారులకు సన్మానం





కదిరిలో ప్రతిమ, పీ మీనాక్షి సుందరిని, పుట్టపర్తిలో రాకేష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

కదిరి లీగల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానికంగా న్యాయాధికారులుగా మూడు సంవత్సరాలు పనిచేసిన ఎస్ ప్రతిమ, పీ మీనాక్షి సుందరి బదిలీ అయిన విషయం తెల్సిందే. వీరిని శుక్రవారం న్యాయవాదుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి.. వీడ్కోలు పలికారు. ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాలను అందజేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● పుట్టపర్తిరూరల్ : స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ పెనుకొండ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన్ను పుట్టపర్తి బార్ అసోషియేషన్ సభ్యులు సన్మానించారు. బార్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, ఏపీపీ రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు నాగమల్లిరెడ్డి, నిడిమామిడి శ్రీనివాసులు, యుదభూషణ్, చల్లాశేఖర్, వెంకటరమణప్ప, పూజారిప్రసాద్, రెహమాన్, కిరణ్, బిందు, హరికృష్ణ, నాగేంద్ర, బాలాజీనాయక్, క్లర్క్ మంజునాథ్ పాల్గొన్నారు.



అధ్యాపకులతో పట్టాలు అందుకున్న విద్యార్థులు

గ్రాడ్యుయేషన్ డే

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పరిధిలోని బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ హేమచంద్ర మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య నైపుణ్యాలు విద్యార్థులను వృత్తి పరంగా ఉన్నత శిఖరాలకు చేరుస్తాయన్నారు. కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ బాలకోటేశ్వరి, తదితర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి ఆర్థికసాయం

తనకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని వంకపల్లికి వెళ్లే రోడ్డులో వంకపల్లికి చెందిన తులసమ్మ సాయి అనాథ ఆశ్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. ఆ ఆశ్రమాన్ని శుక్రవారం సందర్శించిన వైసీపీ నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి రూ. పదివేలు అందించారు. ఆయన వెంట న్యాయవాది వెంకటరామిరెడ్డి, రామ్‌దేశాయి, శివరామిరెడ్డి,హేమ ఉన్నారు.



నల్లమాడలో మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియాపై అవగాహన ర్యాలీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా నల్లమాడ, ఓబుళదేవరచెరువులో వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



ఓడీసీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉగ్రదాడులపై నిరసన ర్యాలీలు





ధర్మవరం : కాగడాలతో టీడీపీ నాయకుల శాంతిర్యాలీ, నల్లబ్యాడ్జీలతో జనసైనికులు నిరసన ర్యాలీ

ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ టీడీపీ నాయకులు శుక్రవారం కాగడాలతో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుని అక్కడ నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, చింతపులుసు పెద్దన్న, రాంపురం శీన, అంబటి సనత్, పల్లపు రవీంద్ర, అడ్రమహేశ్, బొట్టుకిష్టజింకల రాజన్న, సాయి, చిన్నూరు విజయ్‌చౌదరి పాల్గొన్నారు.

● జనసేన ఆధ్వర్యంలో: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా తిరిగి కాలేజ్ సర్కిల్‌కు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఇందులో జనసేన నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, బెస్త శ్రీనివాసులు, రాజారెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

●అలాగే బుక్కపట్నంలో ముస్లింలు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నల్లమాడలో టీడీపీ నాయకులు, ఓడీసీలో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీలు చేపట్టారు.







బుక్కపట్నంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు, నల్లమాడలో టీడీపీ నాయకులు, ఓడీసీలో ఎమ్మార్పీఎస్ నాయకులు..

వైద్య శిబిరానికి భారీ స్పందన



రోగులతో మాట్లాడుతున్న వైద్యుడు

ముదిగుబ్బ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర పాఠశాలలో శుక్రవారం త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. వైద్యాధికారులు వికాస్ నరసింహ, సుదర్శన్, దాదాపు 700 మంది పేద రోగులకు ఈ వైద్య శిబిరంలో ఎకో ఈసీజీ, బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సోముసుందర్ నాయక్, టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్ బాబు, టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, హిందూపురం సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ హేమలతా భాయ్, కుళ్ళాయప్ప నాయక్, దినేష్ నాయక్ పాల్గొన్నారు. రోగులకు లస్సీ, మజ్జిగ పంపిణీ చేశారు.

ఫ్లిప్‌కార్ట్‌కు ఐదు టన్నుల శనగ విత్తనాలు



వేరుశనగ విత్తనాలను ఫ్లిప్‌కార్ట్‌కు పంపుతున్న డైరెక్టర్లు

తనకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొట్టమొదటిసారిగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా ఐదు టన్నుల వేరుశనగ విత్తనాలను ఫ్లిప్‌కార్ట్‌కు పంపినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. విత్తనాల ప్రాసెసింగ్ అనంతరం సిద్ధం చేసిన ఈ విత్తనాలను ఒప్పందం మేరకు ఫ్లిప్‌కార్ట్ సంస్థకు సరఫరా చేసే కార్యక్రమాన్ని శుక్రవారం జండా ఊపి ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మండలంలోని చౌడేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా చేపట్టిన వేరుశనగను పంపినట్లు తెలిపారు. వ్యాపారాలను సక్రమంగా రైతులకు ఉపయోగపడేలా నిర్వహించడం ద్వారానే రైతు సంఘాలు (ఎఫ్‌పీఓలు) అభివృద్ధి సాధ్యమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘాల్లోని డైరెక్టర్లు స్వచ్ఛందంగా రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వేరుశనగ కాయల ప్రాసెసింగ్ యూనిట్ నిరంతరం ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కేఎన్ నరసయ్య, షర్పు డీపీఎం శ్రీనివాసులు, జీవనోపాధులు జీపీఎం రామమోహన్, ఏసీ రవీంద్ర, డైరెక్టర్లు తోట సరోజమ్మ, పెద్దక్క, ఏపీఎం రమణప్ప, పలువురు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు అంకురార్పణ



అంకుర్పారణ పూజలో ప్రముఖులు

నంబులపూలకుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని కొత్తరోడ్డు వద్ద కావమ్మ, మారయ్య తిరునాళ్లకు శుక్రవారం అంకుర్పారణ చేశారు. ఏటా మూడు రోజుల పాటు ఈ తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ యేడాది మే 2న ఈ తిరునాళ్ల ప్రారంభం అవుతాయని నిర్వాహకుడు శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాముల నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు బాబ్‌జాన్, నరసింహులు, మౌలా పాల్గొన్నారు.

రమణ మహర్షి ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని శ్రీరమణ మహర్షి ఆశ్రమం నందు ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. పట్టణంలో పది సంవత్సరాలుగా ఇలా ఆరాధన ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు గోమాతకు పూజలు చేశారు. అనంతరం వందలాదిభక్తులకు నారాయణసేవ నిర్వహించారు.

చెస్ శిక్షణ ప్రారంభం



చెస్ శిక్షణను ప్రారంభిస్తున్న నారాయణప్ప

ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతిలో వేసవి ఉచిత చెస్ శిక్షణ శిబిరాన్ని కళాజ్యోతి సంఘం ప్రసిడెంట్ నారాయణప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణ మే 25వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణకు 150 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో కళాజ్యోతి సంఘం సెక్రటరీ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శింగనమల రామకృష్ణ, వెంకటేశ్, విశ్రాంత అధ్యాపకులు సోమశేఖర్ ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి రమేశ్‌బాబు, కోశాధికారి నాగేంద్ర, శిక్షకులు శివకృష్ణ, ఆదిరత్నం, కిశోర్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నల్లమాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి తండాలో ఎక్సైజ్ ఎస్ఐ నరసింహులు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని.. ఓ మహిళను అరెస్ట్ చేసి.. ఆమెపై కేసు నమోదు చేశామని తెలిపారు.

న్యూస్ బాక్స్

గ్రామస్థాయిలో టీడీపీని బలోపేతం చేయాలి



గ్రామకమిటీ సభ్యులుగా ఎన్నికైనవారికి ధృవపత్రాలు అందిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో టీడీపీని బలోపేతం చేయాలని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, మండల కన్వీనర్ సిద్దయ్య అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని మడకశిర రహదారిలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ కమిటీలను శుక్రవారం ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ మెంబర్లు, బూత్ ఇన్చార్జ్‌లను ఎన్నుకున్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేలా చూడాలని నాయకులు సూచించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

● జిల్లా హార్టికల్చర్ అధికారి



రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని హార్టికల్చర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో ఫర్టిలైజర్ స్పిగ్ కంపెనీ వారి సౌజన్యంతో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు రసాయన ఎరువులు వాడటంవల్ల కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే లాభాల వివరించారు. శాస్త్రవేత్త రామసుబ్బయ్య, రీజనల్ మేనేజర్ వైవీఎస్ మూర్తి, స్పిగ్ కంపెనీ రీజనల్ మేనేజర్ రమణారెడ్డి, నారాయణరెడ్డి, హార్టికల్చర్ అధికారి రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంఈఓ

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా తోటపల్లి గ్రామంలో 21నుంచి 23వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్‌లో వందమీటర్లు, 200మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థి గౌరీశంకర్‌ను ఎంఈఓ ఆంజనేయులునాయక్ శుక్రవారం అభినందించారు. గౌరీశంకర్ పరుగు పందెంలో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. జీవితంలో మరిన్ని పోటీల్లో పాల్గొని గొప్ప క్రీడాకారుడుగా ఎదగాలని ఆకాంక్షించారు.

రేపు ఉచిత వివాహ పరిచయ వేదిక

గోరంట్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్కే థియేటర్ వద్దనున్న కేఎన్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జీవీఆర్ ఉచిత బలిజ వివాహ పరిచయ వేదికను ఆదివారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. మ్యాట్రీమోనీ నిర్వాహకుడు రమణ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. పెళ్లి కాని యువతీ యువకులు, విడాకులు, తీసుకున్నవారు, భర్త లేక భార్య మృతిచెందినవారి ఫొటోల వివరాలతో హాజరుకావాలని కోరారు. బలిజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఐలోకి చేరిక

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లికి చెందిన సీపీఎం నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, నారాయణస్వామి సీపీఐలో శుక్రవారం చేరారు. జిల్లా కార్యదర్శి వేమయ్య ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరినట్లు బాలస్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్ పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 10వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ ప్రకటనలో కోరారు. చెక్‌బౌన్స్, భూతగాదాలు, బ్యాంక్ రుణాలు, మున్సిపాలిటీకి సంబంధించిన రుణాలు, రాజీ అయ్యే కేసులన్నీ పరిష్కరించుకోవచ్చన్నారు.

కేసు నమోదు

హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేళాపురం ప్రాంతంలో నివాసముంటున్న భార్యాభర్తలు జయలక్ష్మి, వెంకటేశ్ బ్లాక్‌మెయిల్ చేశారంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. ఎస్బీఐ కాలనీలో జయలక్ష్మి, వెంకటేశ్ నివాసముంటున్న ప్రాంతంలో సువర్ణ, క్రిష్ణ అనే దంపతులు ఉంటున్నారు. సువర్ణకు ఓ కుమార్తె ఉంది. సువర్ణ ఆమె కుమార్తెకు సంబంధించిన వీడియో ఉందని జయలక్ష్మి ఇప్పటికే రూ.60లక్షలు తీసుకుంది. ఈ డబ్బు ఇరుగుపొరుగువారు ఉన్న బంగారం తాకట్టుపెట్టి ఇచ్చింది. అయినా ఇంకా ఇవ్వాలని జయలక్ష్మి బెదిరిస్తుండటంతో ఆ దంపతులపై సువర్ణ దంపతులు డీజీపీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారంతో జయలక్ష్మి, వెంకటేశులుపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జయలక్ష్మి దంపతులకు టీడీపీ మద్దతుదారుడు ప్రోత్సాహం ఉన్నట్లు సువర్ణ దంపతులు ఆరోపిస్తున్నారు.

మాకు ఇవ్వాల్సిన డబ్బే అడిగాం

ఇదిలా ఉండగా శుక్రవారం జయలక్ష్మీ వెంకటేశులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మావద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సువర్ణ డబ్బులు తీసుకుందన్నారు. ఆ మొత్తాన్ని ఇవ్వాలని డిమాండ్ చేయగా మాతోనే వారు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మావద్ద ఎలాంటి వీడియోలు లేవని, మేమిచ్చిన డబ్బులకు సంబంధించి వారు చెక్కులు కూడా ఇచ్చారన్నారు. ఇచ్చిన డబ్బులు అడగడంతో మాపైనే లేనిపోని నిందలువేస్తున్నారని వాపోయారు. తాము కూడా పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు..!

● అధికారుల మధ్య సమన్వయలోపం

● ఇబ్బంది పడుతున్న గుట్టూరు గ్రామ ప్రజలు



రోడ్డు మధ్యలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని వేసే రహదారులు కొందరి స్వార్థ ప్రయోజనాలకు సాక్షాలుగా మిగులుతున్నాయి. పెనుకొండ మండలం గుట్టూరు ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆర్అండ్‌బీ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నా పనులు ఆపకుండా అలాగే పూర్తి చేశారు.

శాఖల మధ్య సమన్వయలోపం

ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారుల మధ్య సమన్వయలోపం ఉన్నాయనేందుకు ఈ రోడ్డు పనులే నిదర్శనం. విద్యుత్ స్తంభాలు తొలగించి మరో చోటికి వేయాలని ఆర్అండ్‌బీ ఏఈ వెంకటేశులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామి బదులిస్తూ నోటిమాటతో చెబితే సరిపోదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, తొలగింపునకు అయ్యే ఖర్చు భరిస్తే అప్పుడు తొలగిస్తామని అధికారులతో అన్నారన్నారు. ప్రస్తుతానికి సీసీ రోడ్డు మధ్యలో రెండు విద్యుత్‌స్థంబాలున్నాయి. ఇదే రహదారిపై పెద్ద వాహనాలు వెళుతుంటాయి. అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల సమన్వయంతో మొదట విద్యుత్ స్తంభాలు తొలగించి అనంతరం రోడ్డు వేసి ఉంటే ప్రభుత్వానికి నష్టం జరిగేది కాదంటున్నారు. అప్పటికైనా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ క్రైస్తవుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో జరిగిన మారణహోమాన్ని నిరసిస్తూ శుక్రవారం క్రైస్తవులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అమాయక పర్యాటకులను చంపడం హేయమైన చర్య అన్నారు. దీనిని యావత్‌భారతదేశం ఖండిస్తుందన్నారు. కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్, రెవరెండ్ సూర్యప్రకాశ్, స్టీఫెన్‌రాజ్, లైఫ్‌వరల్డ్ ఉదయ్‌కుమార్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో మానవహారం

కశ్మీర్ మారణహోమాన్ని నిరసిస్తూ జనసేన ఆధ్వర్యంలో మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అసువులు బాసిన భారతీయులకు ఆత్మశాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఉగ్రవాదం నశించాలని భారతీయులందరూ ఐక్యంగా ఉండాలని నినదించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన జనసేన పార్టీ నాయకులు

నడిరోడ్డుపై మురుగునీరు

● ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

● పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న మురుగునీరు

మడకశిర రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరువపల్లి గ్రామ ప్రధాన రహదారిలో మురుగునీరు ప్రవహిస్తున్నాయి దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తిచెంది రోగాల బారిన పడుతున్నామన్నారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రోగాలు వ్యాప్తచెందకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

త్వరలో డ్రైనేజీలు నిర్మిస్తాం: వేణుగోపాల్, కార్యదర్శి, చందకచర్ల

త్వరలో గ్రామాలకు డ్రైనేజీలు మంజూరు కానున్నాయి. మరువపల్లి గ్రామంలో డ్రైనేజీలు నిర్మించి రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా ఆపివేస్తారన్నారు. ఆర్టీసీ కాలనీ, త్యాగరాజ్‌నగర్, చైతన్యనగర్, శాంతినగర్, కోర్టు ప్రాంతం, పెనుకొండరోడ్డు, ఆబాద్‌పేట, ముక్కడిపేట, ధర్మపురం, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాల్లో లైన్ మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. జిల్లాప్రాదేశిక సభ్యులు, మండల సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులు తమతమశాఖల ప్రగతినివేదికలతో హాజరు కావాలన్నారు.

అగళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, మండల స్థాయి అధికారులు జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలన్నారు.

న్యాయాధికారికి సన్మానం



న్యాయాధికారి దంపతులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పెనుకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సబ్‌కోర్టులో న్యాయాధికారిగా పనిచేస్తున్న ముజీబ్ పసపల సయ్యద్ పుట్టపర్తి కోర్టుకు బదిలీ అయిన సందర్భంగా ఆయనకు బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రెసిడెంట్ శ్రీనివాసులు, న్యాయవాదులు శర్మ, నాగరాజు ఆధ్వర్యంలో న్యాయాధికారి దంపతులకు పూలమాలలువేసి శాలువకప్పి సత్కరించారు. వారు మాట్లాడుతూ కక్షిదారుల సత్వర న్యాయం కోసం, జూనియర్ న్యాయవాదుల వృత్తిలో రాణించడానికి కావాల్సిన మెళుకువలను న్యాయాధికారి నేర్పించారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. న్యాయవాదులు గౌతమి, జావిద్, బాలాజీ, హరి, నాగిరెడ్డి, హమీద్ పాల్గొన్నారు.

నివాస హక్కులు, నీటి కోసం మహిళల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పాలసముద్రం వాసులు

గోరంట్ల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో నివాసముంటున్నవారు తాగునీరు, నివాసహక్కులకోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నాచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కూడలి వద్ద ప్రభుత్వ స్థలంలో గుడిసెలు, తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నవారికి హైకోర్టు ఉత్తర్వుల మేరకు, పేదల నివాస స్థలాలకు హక్కులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసి, సమస్య పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ లేకపోవడంతో కార్యాలయ సిబ్బంది ప్రదీప్‌కు వినతిపత్రం అందించారు. ముత్యాలప్ప, హనుమయ్య, కొండా వెంకటేష్‌లు, నాగభూషణ, ఆంజనాదేవి, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం



లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మలేరియా వ్యాధిని నిర్మూలిద్దామని మండల వైద్యాధికారి వెంకట చిరంజీవి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీగా వెళ్లి మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా దోమలవృద్ధి చెందకుండా చేయవచ్చన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ: మలేరియా రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యులు రిహానా అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది వెంకటేశ్వర్‌రావు, నరసింహులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల: మలేరియా వ్యాధిని పూర్తిగా రూపుమాపాలని వైద్యఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో ప్రదర్శన జరిపారు. మెడికల్ అధికారి వాసు, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, వైద్య సిబ్బంది రమణ, గంగాధర్ పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం డా. శివానంద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలుచేశారు. వైద్యులు శివానంద, గాయిత్రి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా సోమందేపల్లిలో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం వైద్యులు ఓంకార్ ఆధ్వర్యంలో పురవీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, పర్యవేక్షకులు రవీంద్ర, ఎల్‌టీ అనీల్‌కుమార్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గోరంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

డ్వాక్రా సంఘాల సృష్టికర్త చంద్రబాబు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సృష్టికర్త, దేశంలో తొలిసారి అక్కాచెల్లెమ్మల కోసం ఉచిత సిలిండర్‌లను అందించిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు అన్నారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, రక్షణ విషయాల్లో చిత్తశుద్ధి ఉన్న ఏకైక నేత చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 500 ఉచిత కుట్టుమిషన్లు అందిస్తే మడకశిరలో మాత్రం రెండు వేలు అందించనున్నట్లు తెలిపారు. 90రోజుల అనంతరం మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో దోపిడీకి పాల్పడినట్లు ఆరోపించారు. గత ఎమ్మెల్యే ఎంత దోపిడీ చేశారో అందరికి తెలుసు అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ: నియోజకవర్గంలో రైతాంగాన్ని ఆదుకోనేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అన్నారు. శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులకు ట్రాన్స్‌ఫార్మల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. నియోజకవర్గానికి 300 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని రైతులకు అందించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో లోఓల్టేజీ సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మల కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతి రైతుకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, కౌన్సిలర్లు రాజ, బలరామ్, రమేష్, ఉమేష్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ కొత్త సిలబస్‌పై అవగాహన



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

పెనుకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియట్ విద్యామండలి 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం కోర్సులలో కొత్త సిలబస్ ప్రవేశపెట్టడం, ప్రశ్నాపత్రం విధానంలో చేసిన మార్పులపై అధ్యాపకులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యసాయి జిల్లాలోని వివిధ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ గెస్ట్, జూనియర్ లెక్చరర్లకు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు నాలుగు దశల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, రెండో దశలో మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, మూడో దశలో జువాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్, నాలుగోదశలో కామర్స్, సంస్కృతం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించి అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

హంద్రీనీవా కాలువలో కోళ్ల వ్యర్థాలు



హంద్రీనీవా కాలువలో తేలియాడుతున్న కోళ్ల వ్యర్థాలు

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలం నక్కలగుట్ట కాలనీసమీపంలో హంద్రీనీవా కాలువలో కోళ్ల వ్యర్థాలు పారబోశారు. గొల్లపల్లి నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురానికి తాగునీరు సరఫరా అవుతున్న హంద్రీనీవా కాలువలో ఓ కోళ్ల యజమాని కోళ్ల వ్యర్థాలను పారబోశాడు. రోగాలతో మృతిచెందిన కోళ్లను ఊరిబయట పారబోయడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి. అయితే కాలువలో వేయడంపట్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్లఫారం యజమాని నిర్లక్ష్యంపై వారు మండిపడుతున్నారు. అసలే వేసవి గుక్కెడు నీరు దొరక్క మూగజీవాలు అలమటిస్తున్నాయి. కాలువ నీళ్లలో అవి ఉపశమనం పొందుతుంటాయి. ఇలాంటి దుశ్చర్యవల్ల ఎంతటి ప్రమాదమో అర్థం చేసుకోవచ్చు. కోళ్ల యజమానిపై కఠిన చర్యలు తసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి లేని సంఘాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న గుజనుడు గ్రామ రైతులు

పావగడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గుజనుడు గ్రామ పంచాయతీ పరిధిలో సహకార సంఘం ఏర్పాటులో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు కిరణ్ ఎలాంటి అనుమతులు లేకుండా కాంగ్రెస్ ఏజెంట్లను నియమించారని ఆ గ్రామానికి చెందిన ప్రజలు ఆరోపించారు. సొంత లాభాల కోసం సంఘాన్ని ఏర్పాటు చేశారని, అనుమతి లేని సంఘాన్ని రద్దుచేసి రైతులకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన అశోక్, చంద్రన్న, రంగస్వామి, వీరన్న, హనుమంతరాయప్ప, బీమన్న, రామకృష్ణ విలేకరులకు తెలిపారు. రైతుల అభివృద్ధికోసం గ్రామ పంచాయతీలోని సభ్యులు, ఇతరులను జతపరుచుకుని సహకార సంఘం ఏర్పరుచుకోవాల్సిన బాధ్యత సహకార సంఘానికి ఉందన్నారు. ఆ నిబంధనలు డా.కిరణ్ తుంగలో తొక్కి తమకు ఇష్టం వచ్చిన కాంగ్రెస్ ఏజెంట్లను మాత్రమే నియమించుకుని సంఘం ఏర్పరిచి ప్రభుత్వానికి గండిపెట్టాలని చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిగణించి రైతులకు అన్ని విధాలా అనుకూలంగా వ్యవహరించాలన్నారు.